## క్లుప్తంగా

### నార్లపూర్‌లో భీరన్నదేవుని పట్నాలు

మందమర్రిరూరల్: మున్సిపాలిటీ పరిధిలోని నార్లపూర్‌లో ఆరు రోజులుగా కుర్మసంఘం ఆధ్వర్యంలో భీరన్నదేవుని జాతర కొనసాగుతోంది. ఆలయ ప్రాంగణంలో బుధవారం పట్నాలు వేయగా ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్కసుమన్ హాజరై మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు, పూజారులు సుమన్‌కు ఆచారం ప్రకారం గొంగడి, కండువాను బహూకరించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్, అనుబంధ సంఘాల నాయకులు కుర్మసంఘం నాయకులు గ్రామస్తులు ఉన్నారు.

### లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు ఆవరణలో ఈ నెల 10వ తేదీన నిర్వహిస్తున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జూనియర్ సివిల్ జడ్జి అసదుల్లా షరీఫ్ అన్నారు. కోర్టు ఆవరణలో న్యాయవాదులతో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. లోక్ అదాలత్‌లో కేసులను సత్వర పరిష్కారం కోసం ఏర్పాటు చేసుకోవచ్చని కక్షిదారులకు న్యాయవాదులు తెలియజేయాలన్నారు. కేసులను పరిశీలించి ముందుగానే వారితో చర్చించి మాట్లాడాలని వారికి అవగాహన కల్పించాలన్నారు. అధిక సంఖ్యలో కేసులను లోక్ అదాలత్‌లో తొలగించేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు కారుకూరి సురేందర్, ఏజీపీ పద్మ, న్యాయవాదులు అక్కల శ్రీధర్, సత్యనారాయణ, నళినికాంత్, తిరుపతిస్వామి, సత్యగౌడ్, రవి, గణేష్ సిబ్బంది పాల్గొన్నారు.

### దరఖాస్తుల ఆహ్వానం

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లిలోని రాష్ట్ర మైనారిటీ గురుకుల బాలికల కళాశాలలో ఖాళీగా ఉన్న జువాలజీ ఫ్యాకల్టీ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ షబానా అన్సారీ ఒక ప్రకటనలో తెలిపారు. 2023–24 విద్యాసంవత్సరంలో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో జువాలజీ పాఠాలు బోధించడానికి ఆసక్తి గల అభ్యర్థులు మంచిర్యాల డీఎండబ్ల్యూ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. బీఈడీ, ఎంఎస్సీ(జువాలజీ) చదివిన వారు ఈ పోస్టుకు అర్హులని తెలిపారు. ఆసక్తిగల వారు తమ విద్యార్హత ధ్రువీకరణ పత్రాల జిరాక్స్ సెట్‌ను బెల్లంపల్లి కళాశాలలో అందజేయడంతో పాటు, మంచిర్యాల కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాల కోసం సెల్:9502724286, 89786 52487 ,8897396562 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

### విజేతలకు బహుమతులు ప్రదానం

దండేపల్లి: మండలంలోని తాళ్లపేటలో వారం రోజులుగా జరుగుతున్న క్రికెట్ పోటీలు బుధవారం ముగిశాయి. మొత్తం ఆరుజట్లు పాల్గొనగా, విన్నర్‌గా తాళ్లపేటకు చెందిన కోట్నాక ప్రేంసాగర్ టీం, రన్నర్‌గా బోడకుంటి వెంకటేష్ టీంలు నిలిచాయి. దీంతో విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ పుట్టపాక తిరుపతి, మాజీ వైస్‌ఎంపీపీ రాజేందర్, స్థానిక నాయకుడు ముస్తాఫా, తదితరులు పాల్గొన్నారు.

### పద్మశాలీ భవన నిర్మాణ పనులకు భూమిపూజ

భీమారం: మండల కేంద్రంలో నిర్మించనున్న పద్మశాలీ భవన నిర్మాణ పనులకు బుధవారం పద్మశాలీ సంఘం అధ్యక్షుడు గుడిమల్ల వెంకటేశ్ భూమిపూజ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పద్మశాలీ కుటుంబాలు అధికంగా ఉన్నా ప్రభుత్వం ఏమాత్రం ప్రాధాన్యతనివ్వడం లేదన్నారు. మండల కేంద్రంలో భవనం నిర్మాణం కోసం చేపట్టిన పనులను త్వరలో పూర్తి చేసి అందుబాటులోకి తెస్తామన్నారు. వార్డుసభ్యులు నరహరి, కులస్తులు పాల్గొన్నారు.

### రూ.5వేల ప్రోత్సాహకం అందజేత

దండేపల్లి: మండలంలోని మేదరిపేటకు చెందిన కోటగిరి ప్రశాంత్ దంపతులకు బుధవారం ఆడకూతురు జన్మించింది. దీంతో వారి కుటుంబానికి నలిమెల వినయ్ స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా రూ.5వేల ప్రోత్సాహకం అందించారు.

### 'పరేషాన్' సక్సెస్‌పై హర్షం

శ్రీరాంపూర్: సింగరేణి కార్మికులు, బొగ్గుగనుల ఇతివృత్తంగా తీసిన పరేషాన్ సినిమా విజయవంతం కావడంపై ఆ చిత్రయూనిట్ హర్షం వ్యక్తం చేసింది. చిత్ర రచయిత అక్కల చంద్రమౌళి, నటులు రాజేశ్, చిరు తదితరులు వారు షూటింగ్ చేసిన శ్రీరాంపూర్ తదితర ప్రాంతాల్లో బుధవారం పర్యటించారు. కార్మికుల కుటుంబాలను కలిసి సినిమాను సక్సెస్ చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. శ్రీరాంపూర్ బస్టాండ్ వద్ద స్థానిక ఎస్సై రాజేశ్‌ను కలిసి సినిమా టాక్‌పై చర్చించారు. సినిమాను సక్సెస్ చేసినందుకు వారు కార్మికవర్గానికి కృతజ్ఞతలు తెలిపారు.

# 'డబుల్ బెడ్‌రూం' ఊసేది!

- ముందుకుసాగని ఇళ్ల నిర్మాణాలు
- స్థలం వివాదంతో నిలిచిన పనులు
- గృహలక్ష్మి పథకంపై పెరుగుతున్న ఆశలు


రెబ్బెనలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం కోసం అధికారులు కేటాయించిన స్థలం

రెబ్బెన: మండలానికి మంజూరైన డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాల ప్రక్రియ ఏళ్లు గడుస్తున్న ముందడుగు పడటం లేదు. ఇళ్ల నిర్మాణాల కోసం రెవెన్యూ అధికారులు కేటాయించిన స్థల వివాదం కారణంగా నిలిచిపోయిన నిర్మాణాలు ఇప్పటికీ ప్రారంభం కాలేదు. స్థలం వివాదాన్ని సాకుగా చూపి అధికారులు నిర్మాణాలు చేపట్టకుండా చేతులు దులుపుకున్నారు.

**70 ఇళ్లు మంజూరు..**

మండలంలోని రెబ్బెన, కొండపల్లి గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం 70 డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేసింది. రెబ్బెన పంచాయతీకి 40, కొండపల్లి పంచాయతీకి 30 చొప్పున ఇళ్లు మంజూరయ్యాయి. రెబ్బెనకు మంజూరైన ఇళ్ల నిర్మాణం కోసం ఇందిరానగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో రెవెన్యూ అధికారులు భూమిని కేటాయించారు. కొండపల్లికి మంజూరైన ఇళ్ల కోసం నేర్పల్లి పరిసరాల్లో స్థలాన్ని కేటాయించారు. మొదటగా రెబ్బెనకు మంజూరైన 40ఇళ్ల నిర్మాణాల కోసం టెండర్లు పిలిచి కాంట్రాక్టర్‌కు పనులు సైతం అప్పగించారు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ రెవెన్యూ అధికారులు కేటాయించిన స్థలంలో పిల్లర్ల కోసం గుంతలు తవ్వగా భూమి తనదే అంటూ యజమాని అభ్యంతరం తెలపడంతో పనులు నిలిచిపోయాయి. సదరు భూయజమాని స్థలం వివాదంపై కోర్టును ఆశ్రయించడంతో రెబ్బెనకు మంజూరైన ఇళ్ల నిర్మాణాలు అక్కడితో నిలిచిపోయాయి. కొండపల్లికి మంజూరైన ఇళ్ల కోసం కేటాయించిన స్థలం ఇదే తరహాలో వివాదం తలెత్తటంతో అధికారులు టెండర్లు కూడా పిలవకుండా వదిలేశారు. అధికారులు ప్రత్యామ్నాయ స్థలాన్ని కేటాయించకపోవటంతో 70 డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మాణానికి నోచుకోకుండా పోయాయి.

**ఆశలన్నీ 'గృహలక్ష్మి' పైనే..**

ప్రస్తుతం నిరుపేదలు గృహలక్ష్మి పథకంపై ఆశలు పెంచుకుంటున్నారు. సొంత జాగాలు ఉండి ఇళ్లు లేని నిరుపేద వర్గాలకు ఈ పథకం కింద రూ.3లక్షల ఆర్థిక సహాయాన్ని అందించాలని రాష్ట్ర ప్రభుత్వం 2021లో నిర్ణయించింది. ఒక్కో నియోజకవర్గానికి 3వేల ఇళ్ల చొప్పున మంజూరు చేస్తామని ప్రకటించింది. దీంతో మండలంలోని నిరుపేద వర్గాల్లో మరోసారి ఆశలు చిగురిస్తున్నాయి. ఇళ్లు కూలిపోయిన వారికి, ఇళ్లు లేని వారిని దృష్టిలో పెట్టుకుని ప్రారంభించనున్న గృహలక్ష్మి పథకంతో సొంత గూడు నిర్మించుకోవచ్చని భావిస్తున్నారు. అయితే మండలంలో ఈ పథకం ద్వారా ఎంతమందికి లబ్ధి చేకూరుతుందో వేచి చూడాలి.

### నిర్మాణ పనులు చేపట్టాలి



మండలానికి మంజూరైన డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణ పనులు వెంటనే చేపట్టాలి. స్థలం వివాదం సాకుతో పనులు నిలిపివేయడం సరికాదు. ఇళ్ల నిర్మాణాల కోసం సరైన స్థలాన్ని కేటాయించకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు.

– దుర్గం రవీందర్, సీపీఐ మండల కార్యదర్శి

### అర్హులందరికీ ఇవ్వాలి



ప్రభుత్వం అమలు చేయనున్న గృహలక్ష్మి పథకం ద్వారా అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం అందజేయాలి. మండలంలో సొంత స్థలాలు ఉండి ఇళ్లు లేని వారందరిని గుర్తించాలి. కొంత మందికి ఇచ్చి కొంతమందికి ఇవ్వకుంటే బాధపడాల్సి వస్తుంది.

– శ్రీనివాస్, ఆటోడ్రైవర్

### పేదలకు ఉపయోగం



గృహలక్ష్మి పథకం ఎంతోమంది పేదలకు ఉపయోగకరంగా ఉంటుంది. సొంతంగా ఇంటి స్థలం ఉండి ఇళ్లు లేనివారికి ప్రభుత్వం రూ.3లక్షల సాయం చేయనుంది. పేదల సంక్షేమమే ధ్యేయంగా సీఎం పథకాలు అమలు చేస్తున్నారు.

– పోటు శ్రీధర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు

# దాతలే దిక్కు..!

- తల్లిదండ్రుల మృతితో అనాథలైన పిల్లలు
- దాతలు ఆదుకోవాలని వేడుకోలు


అనాథలైన ముగ్గురు పిల్లలు

కౌటాల: భార్య, భర్త, ముగ్గురు పిల్లలు.. అప్పటి వరకు సజావుగా సాగుతున్న ఆ కుటుంబాన్ని చూసి విధి ఓర్వలేకపోయింది. ఏడాది వ్యవధిలో దంపతులిద్దరు అనారోగ్యంతో మృతి చెందారు. తల్లి క్యాన్సర్ వ్యాధికి బలి కాగా తండ్రి హైబీపీతో నరాలు చిట్లి మృతి చెందాడు. దీంతో ముగ్గురు పిల్లలు అనాథలుగా మారారు. ప్రస్తుతం చిన్నారుల బాగోగులు వృద్ధుడైన తాతయ్య చూసుకుంటుండగా, వారు ఉండేందుకు సరైన ఇల్లు లేదు. అనాథలైన చిన్నారుల దయనీయ పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని దాతలు, ప్రభుత్వం ఆపన్నహస్తం అందించాలని పలువురు కోరుతున్నారు.

**నాడు అమ్మ .. నేడు నాన్న..**

కౌటాల మండలంలోని ముత్తంపేట గ్రామానికి చెందిన లేండుగురే బాపురావు –సత్యబాయి దంపతులకు ముగ్గురు సంతానం. పెద్ద కుమారుడు గోపాల్ (12), కూతురు మమత (10), చిన్న కుమారుడు విఘ్నేశ్వర్(8) ఉన్నారు. గతేడాది తల్లి సత్యబాయి క్యాన్సర్ బారిన పడి మృతి చెందగా, తండ్రి బాపురావు హమాలీ పని చేస్తూ పిల్లలను పోషించాడు. కాని తల్లి లేని జ్ఞాపకాలను ఇంకా మరువక ముందే తండ్రి సైతం పిల్లలకు దూరమయ్యాడు. ఇటీవల బాపురావు అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో ముగ్గురు పిల్లలు దిక్కులేని వారయ్యారు.

### అనాథలైన పిల్లలు

తల్లిదండ్రుల మృతితో ముగ్గురు పిల్లలు అనాథలు గా మారారు. తాతయ్య వృద్ధుడు కావడంతో పిల్లల సంరక్షణ బాధ్యత ప్రశ్నార్థకంగా మారింది. పిల్లల సంరక్షణ, చదువు బాధ్యతలను ప్రభుత్వం తీసుకోవాలని, ఆ దిశగా అధికారులు, పాలకులు చొరవ చూపాలని బంధువులు కోరుతున్నారు. స్వచ్ఛంద సంస్థలు, దాతలు ఆదుకోవాలని వేడుకుంటున్నారు. బాధిత పిల్లలను ఎమ్మెల్యే కోనప్ప పరామర్శించి రూ.25వేల నగదు సాయం అందించారు. పిల్లలను అన్ని విధాల ఆదుకుంటామని హామీ ఇచ్చారు. కాగా అనాథైన పిల్లల పరిస్థితిని చూసి ఆదుకోవడానికి పలువురు ముందుకొస్తున్నారు. ఇటీవల మాలి సంఘం ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందజేశారు. దాతలు స్పందించి పిల్లలను ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

**సాయం చేయాలనుకునేవారు..**

ఫోన్‌పే నంబర్: 77320 31811
లెండుగురే శంకర్
(బాధిత పిల్లల పెద్దనాన్న),
బ్యాంక్ అకౌంట్ నంబర్
7903 1387 643
IFSC : SBIN0RRDCB
తెలంగాణ గ్రామీణ బ్యాంక్
ముత్తంపేట్, కౌటాల

# చెరువుల వద్ద తోరణాలు కట్టాలి


మాట్లాడుతున్న ఎంపీడీవో


హాజరైన వివిధ శాఖల సిబ్బంది

కెరమెరి: నేడు నిర్వహించనున్న ఊరూరా చెరువుల పండుగలో భాగంగా చెరువులు, ప్రాజెక్టుల వద్ద తోరణాలు కట్టాలని, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని ఎంపీడీవో సత్యనారాయణ గౌడ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దశాబ్ది ఉత్సవాల్లో అన్ని గ్రామాలకు చెందిన ప్రజలు పాల్గొనేలా అవగాహన కల్పించాలన్నారు. మండలంలోని అమ్మన్నమడుగు, భీతర్‌మాల్, చందు, ఝరి ట్యాంక్‌లలో ఉత్సవాలను నిర్వహించుకోనున్నట్లు తెలిపారు. సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో ర్యాలీ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీవో సుదర్శన్, ఈజీఎస్ ఏపీవో మల్లయ్య, ఐకేపీ ఏపీఎం జగదీశ్వర్, గ్రామ కార్యదర్శులు, ఈజీఎస్ టీఏలు, అంగన్‌వాడీలు, ఐకేపీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

# విగ్రహాల ప్రతిష్ఠాపనకు అనుమతివ్వాలి

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని జన్మభూమినగర్ ప్రాంతంలో మహనీయుల విగ్రహ ప్రతిష్ఠాపన కోసం అనుమతులివ్వాలని బహుజన ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు బుధవారం మున్సిపల్ కార్యాలయంలో మేనేజర్ విజయ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సామాజిక న్యాయం కోసం ఉద్యమించిన మహాత్మా జ్యోతిబా పూలే, అంబేద్కర్, కుమురం భీం విగ్రహాల ఏర్పాటు కోసం జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు చార్వాక డంబ్ అండ్ డెఫ్ సొసైటీ చైర్మన్ డాక్టర్ నీలకంఠేశ్వర్ గౌడ్ తన సొంత స్థలాన్ని దానం చేశారన్నారు. ఆ స్థలంలో విగ్రహాల ఏర్పాటుకు జిల్లా అధికారులు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో బహుజన ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు మంతెన మల్లేష్, ఒడ్డేపల్లి మనోహర్, బోనగిరి రాజారెడ్డి, కలువల సంతోష్, పలిగిరి కనకరాజు, కోవ జంగు, గుండా రఘుపతి, సామల మనోజ్ రంగు రాజేశం, బీసీ సంక్షేమసంఘం జిల్లా అధ్యక్షుడు భూ దాత డాక్టర్ నీలకంఠేశ్వర్‌రావు పాల్గొన్నారు.

### ఎస్‌వోగా రైజా బాధ్యతలు


బాధ్యతలు స్వీకరిస్తున్న రైజా

ఆసిఫాబాద్‌రూరల్: వాంకిడి కేజీబీవీ పాఠశాలలో బుధవారం స్పెషల్ ఆఫీసర్‌గా రైజా బాధ్యతలు తీసుకున్నారు. గతంలో పని చేసిన ఎస్‌వో బదిలీపై నిర్మల్ వెళ్లారు. రైజా మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధి, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేస్తామన్నారు. రైజాను జిల్లా సెక్టోరియల్ అధికారిణి స్వర్ణ, రాథోడ్ సుభాష్, కేజీబీవీ సిబ్బంది శాలువాలతో ఘనంగా సన్మానించారు.

### గుడిపేటకు మహర్దశ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): జిల్లా కేంద్రానికి ఆనుకుని ఉన్న హాజీపూర్ మండలం గుడిపేట 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్ సమీపంలో దాదాపు 40ఎకరాల స్థలంలో మెడికల్ కళాశాల నిర్మాణానికి బీజం పడుతోంది. సీఎం కేసీఆర్ చేతుల మీదుగా 9వ తేదీ శుక్రవారం మెడికల్ కళాశాల నిర్మాణానికి శంకుస్థాపన జరగనుంది. గుడిపేటలో మెడికల్ కళాశాల ఏర్పాటుపై ఆది నుంచి 'సాక్షి' దినపత్రికలో వరస కథనాలు ప్రచురితం కావడం.. ఆ కథనాలు సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావుల దృష్టికి వెళ్లడం.. ఆపై మెడికల్ బోర్డు అధికారులు గుడిపేటలో మెడికల్ కళాశాల ప్రతిపాదిత స్థలాన్ని కలెక్టర్‌తో కలిసి సందర్శించడం వరసగా జరగడంతో ఎట్టకేలకు గుడిపేటకు మెడికల్ కళాశాల మంజూరయ్యింది. మంచిర్యాల గోదావరిరోడ్‌లోని భూదాన్ బోర్డ్ భూమి, నస్పూర్‌లోని సింగరేణి స్థలం, జైపూర్ మండలం ఇందారం, మంచిర్యాలలోని సాయికుంటలోని ప్రభుత్వ భూమి ఇలా ఎన్నో స్థలాలు ప్రతిపాదనలు చేసినా చివరకు హాజీపూర్ మండలంలోని గుడిపేట ఖరారు అయ్యింది. 2021జులైలో హాజీపూర్ మండలం గుడిపేటలో ప్రతిపాదించిన స్థలం ఖరారు కావడంతో ఈ ప్రాంత ప్రజలు సంబురాలు జరుపుకున్నారు. ఇక ఈ మెడికల్ కళాశాలను రూ.510కోట్లతో నిర్మాణం చేపట్టబోనున్నారు. ఏదిఏమైనా గుడిపేటలో మెడికల్ కళాశాల ఏర్పాటు కానుండటంతో ఈ ప్రాంతం అభివృద్ధిలోకి రానుంది.

### బీసీలకు ఎమ్మెల్యే టికెట్ కేటాయించాలి

పాతమంచిర్యాల: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీలు మంచిర్యాల నియోజకవర్గం ఎమ్మెల్యే టికెట్‌ను బీసీ సామాజిక వర్గానికి కేటాయించాలని బీసీ సంఘాల ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ గుమ్ముల శ్రీనివాస్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 75శాతం బీసీల జనాభా ఉందన్నారు. బీసీ సంఘాల ఐక్యవేదిక జిల్లా కోకన్వీనర్‌లు పాల్గొన్నారు.

### కులవృత్తుల సాయం కోసం దరఖాస్తు చేసుకోండి

భీమిని/పాతమంచిర్యాల: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ప్రారంభించబోయే కులవృత్తులు, చేతివృత్తుల వారికి రూ. లక్ష సాయం పథకానికి విశ్వబ్రాహ్మణులు దరఖాస్తు చేసుకోవాలని విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం జిల్లా అధ్యక్షుడు మడుపు రాంప్రకాష్, విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ ఐక్య సంఘం జిల్లా అధ్యక్షుడు మట్టల రమేష్ అన్నారు. జిల్లా కేంద్రంలో విశ్వకర్మ, విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులతో బుధవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ నెల 20లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ పట్టణ సంఘం అధ్యక్షుడు పెద్దపల్లి పురుషోత్తం, నాయకులు రామోజు రాజేశ్వర్, కోటోజు రమేష్, కొక్కొండ రమణయ్య, శ్రీపాద రవి, అకెనపల్లి మధు, చింతల మధు తదితరులు పాల్గొన్నారు.

# 'ఎన్నికల్లో కోనప్పకు బుద్ధి చెప్పాలి'


మాట్లాడుతున్న పాల్వాయి హరీశ్‌బాబు

చింతలమానెపల్లి: ప్రాణహిత ప్రాజెక్టును కాళేశ్వరానికి తరలించినా అడ్డుచెప్పని సిర్పూర్(టి) ఎమ్మెల్యే కోనేరు కోనప్పకు రానున్న ఎన్నికల్లో రైతులు తగిన బుద్ధి చెప్పాలని బీజేపీ నేత పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. పల్లెపల్లెకు పాల్వాయి –గడపగడపకు బీజేపీ పాదయాత్ర బుధవారం 28వరోజు మండలంలోని నందికొండ, టేకంగూడ, జజులగూడ గ్రామాల్లో కొనసాగింది. ఆయన మాట్లాడుతూ ప్రాణహిత ప్రాజెక్టును కాళేశ్వరానికి తరలించి సీఎం కేసీఆర్ సిర్పూర్ రైతులకు తీవ్ర అన్యాయం చేశారని ఆరోపించారు. గతంలో ప్రాణహిత కాల్వకు నీళ్లు ఇస్తానని గొప్పలు చెప్పిన కోనప్ప అసెంబ్లీలో ఒక్కమాట కూడా ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో నాయకులు మల్లయ్య, ఉమామహేశ్, రమేశ్, మల్లేశ్, భీమయ్య, రామన్న, సత్తయ్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి


అన్నప్రాసన నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

కౌటాల: చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని అంగన్‌వాడీ టీచర్ జీజాబాయి అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం మండల కేంద్రంలోని కౌటాల అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ చిన్నారులకు తల్లిపాలతో పాటు బలమైన ఆహారం అందించాలన్నారు. పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సరోజ, సుజాత, జీజాబాయి, ఏఎన్‌ఎం రజిని, తదితరులు పాల్గొన్నారు.

# 'రషీద్‌పై చర్యలు తీసుకోవాలి'


మాట్లాడుతున్న ఆదివాసీ నాయకులు

కౌటాల: ఆదివాసీ మహిళపై లైంగికవేధింపులకు యత్నించిన అబ్దుల్ రషీద్‌పై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని ఆదివాసీ సంఘం మండలాధ్యక్షుడు అశోక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఆదివాసీ భవనంలో ఆయన మాట్లాడారు. చింతలమానెపల్లి మండలం డబ్బా గ్రామ సర్పంచ్ కుమారుడు అబ్దుల్ రషీద్ అర్ధరాత్రి ఆదివాసీ మహిళ ఇంట్లో చొరబడి అత్యాచారయత్నానికి పాల్పడినట్లు ఆరోపించారు. స్థానికులు గమనించి పట్టుకోవడంతో ఆదివాసీలను దూషించాడన్నారు. ఆదివాసీ సమాజాన్ని తీవ్రంగా దూషించిన రషీద్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని, లేకుంటే ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఆదివాసీ సంఘం మండల నాయకులు దిలీప్, బాజీరావ్, నాందేవ్ తదితరులు ఉన్నారు.

# మహారాష్ట్ర బడుల్లో చేర్పించొద్దు


ఏసాపూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు


ఆసిఫాబాద్‌రూరల్: ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

కెరమెరి: మహారాష్ట్ర బడుల్లో పిల్లలను చేర్పించొద్దని ఎంఎస్‌వో (మండల స్పెషల్ ఆఫీసర్) ఆడే ప్రకాశ్ అన్నారు. బుధవారం మండలంలోని సరిహద్దుల్లో ఉన్న నారాయణగూడ, భోలాపటార్, ఏసాపూర్ గ్రామాల్లో కొనసాగిన బడిబాటలో పాల్గొని మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న పథకాలను పొందుతూ, పిల్లలను మహారాష్ట్ర బడులకు పంపడం ఏంటని ప్రశ్నించారు. తెలంగాణలోని బడుల్లో మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు.

**బడీడు పిల్లలను బడిలో చేర్పించాలి**

ఆసిఫాబాద్‌రూరల్: బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని జిల్లా సెక్టోరియల్స్ సుభాష్, స్వర్ణ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో కేజీబీవీ, ఆర్‌ఆర్ కాలనీ పాఠశాలలో బాడిబాట కార్యక్రమంలో పాల్గొని అవగాహన ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ 5సంవత్సరాలు నిండిన పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కొయ్యకాలుకు నిప్పు.. పొలానికి ముప్పు

- తగ్గిపోతున్న భూసారం
- కలియదున్నితే భూమికి పోషకాలు


కాలుతున్న వరి కొయ్యకాలు

దహెగాం: ఖరీఫ్ సాగుకు రైతులు సమాయత్తమవుతున్నారు. ఇందులో భాగంగా వరి కొయ్యకాలు పొలంలో కలియదున్నకుండా కొంతమంది రైతులు నిప్పు పెడుతుంటారు. దీని వల్ల భూసారం తగ్గడంతో పంటల దిగుబడిపై ప్రభావం ఉంటుందని వ్యవసాయాధికారులు హెచ్చరిస్తున్నారు. వరి కొయ్యకాలును పొలంలో కలియదున్నాలని దీంతో నత్రజని, భాస్వరం తదితర పోషకాలు భూమికి లభిస్తాయని పేర్కొంటున్నారు.

**ఆరువేల ఎకరాల్లో సాగు..**

మండల కేంద్రంతో పాటు లగ్గాం, కమ్మర్‌పల్లి, మర్రిపల్లి, ఒడ్డుగూడ, గెర్రె, గిరవెల్లి, చంద్రపల్లి, కుంచవెల్లి, తదితర గ్రామాల్లో యాసంగిలో 6వేల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. వరి కోతలు కాగానే కొందరు వరిగడ్డిని పశుగ్రాసంగా వినియోగిస్తున్నారు. పశువులు లేని రైతులు వరిగడ్డిని ఇతరులకు విక్రయిస్తుంటారు. మిగిలిన గడ్డిని పొలంలోనే వదిలేస్తారు. గడ్డి మురిగిన తర్వాత పొలంలో కలియదున్నడం వల్ల ఎరువుగా మారి భూమి సారవంతత పెరుగుతుందని అధికారులు పేర్కొంటున్నారు. కాని కొందరు రైతులు మాత్రం వరిగడ్డి ఉండడం వల్ల మళ్లీ వరినాట్లు వేసే క్రమంలో మొలకెత్తి కలుపుగా మారుతాయంటున్నారు.

**కలియ దున్నడం వల్ల ప్రయోజనాలు..**

వరి కొయ్యకాలుకు నిప్పు పెట్టడం వల్ల పొలానికి నష్టం కలుగుతుందని, పొలాల్లో కలియదున్నడం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. నిప్పు పెట్టడం వల్ల కాలుష్యం పెరగడంతో పాటు, భూమిలోని సారవంతత తగ్గుందని, మంచి చేసే బ్యాక్టీరియా, వానపాములు చనిపోతాయని పేర్కొంటున్నారు. కలియదున్నడంతో సేంద్రియ గుజ్జు పెరగడంతో పాటు కార్బన్ కంటెంట్ పెరుగుతుందంటున్నారు. కంది, పెసర పంటలను కలియ దున్నడం ద్వారా నైట్రోజన్ పెరగడంతో పాటు యూరియా మోతాదు తగ్గించుకోవచ్చని అవగాహన కల్పిస్తున్నారు.

### కలియదున్నడం వల్ల లాభాలు

వరి సాగు చేసిన రైతులు వరిగడ్డి, కొయ్యకాలుకు నిప్పు పెట్టడం వల్ల భూమికి అనేక రకాలుగా నష్టం జరుగుతుంది. కలియదున్నడం ద్వారా భూమికి తగిన పోషకాలు లభిస్తాయి. రైతులు కొయ్యకాలు, వరిగడ్డిని కలియదున్నడం ద్వారా ఎరువుల ఖర్చు తగ్గించుకోవచ్చు.

– వంశీకృష్ణ, ఏవో, దహెగాం

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కొమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా :
9010608462
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
కొమురంభీం ఆసిఫాబాద్ :
తిరుపతి, ACO - 7997958206
సిర్పూర్ కాగజ్‌నగర్ : కె.విజయకుమార్, S.R. - 7672055661
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899